క్లుప్తంగా

ఘనంగా గంగమ్మ తల్లి పొంగళ్లు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవాని అమ్మ వారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని పూజారులు మెట్టిల బాలరాజు, పి.విజయలక్ష్మి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పుట్ట, నాగ శిలలు, మల్లికార్జున స్వామి వారికి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఏఆర్ కె.ప్రసాద్, సిబ్బంది పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ ఉత్సవం



పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి

దొనకొండ: మండలంలోని చందవరం పంచాయతీ దేశిరెడ్డిపల్లి గ్రామంలో పోలేరమ్మతల్లి ఉత్సవం ఆదివారం సాయంత్రం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. బొడ్డురాయికి పూజల అనంతరం మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామం పచ్చగా ఉండాలని గ్రామ దేవతలను వేడుకున్నారు.

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై రాయితీ

పొదిలి: విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణలో భాగంగా ప్రస్తుత బిల్లులో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కామసాని మోహనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో అనుమతి ఇచ్చిందని తెలిపారు. 1 కిలోవాట్ లోడ్‌కు రూ.2250 అవుతుండగా రూ.1250, 2 కిలోవాట్ల లోడ్‌కు రూ.4450 అవుతుండగా రూ.2450, 3 కిలోవాట్ల లోడ్‌కు రూ.6,650 అవుతుండగా రూ.3,650 చెల్లించిలోడ్ క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని వివరించారు. ఈ నెల 30వ తేదీలోగా బిల్లులు చెల్లించి, లోడ్ క్రమబద్ధీకరణ చేసుకోవాలని ఏఈ సూచించారు.

గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తం

- త్రిపురాంతకేశ్వర స్వామిని దర్శించుకోవాలంటే గుంతలు దాటాల్సిందే
- యమపురికి దారి చూపుతున్న పుల్లలచెరువు రోడ్డు
- హసనాబాద్ రోడ్డుకు కంకరపరిచారే కానీ తారువేయడం మరిచారు



వై.పాలెం: త్రిపురాంతకం రోడ్డు పరిస్థితి ఇది



యమపురికి దారి చూపించే పుల్లలచెరువు రోడ్డు

యర్రగొండపాలెం: నియోజకవర్గంలో ఉన్న ప్రధాన రహదారులతోపాటు గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. ఏ రోడ్డు చూసినా గుంతలు, మిట్టలతో కనిపిస్తుంటాయి. వర్షం వస్తే ఆ గుంతల్లో నీరు నిలిచి వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అర గంట ప్రయాణం చేయాల్సిన రోడ్లపై గంటల తరబడి వాహనాలు నడపాల్సి వస్తుందని ద్విచక్రవాహన దారులు వాపోతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణం నరకంగా మారుతుందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని వారు అంటున్నారు. యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకానికి 20 కిలోమీటర్లు వెళ్లే తారురోడ్డుపై కిలోమీటరుకు దాదాపు 20 పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని చోట్ల రోడ్డు కనిపించకుండా పోయింది. మరికొన్ని చోట్ల మెటల్ రోడ్డుగా కనిపిస్తుంది. ఈ రోడ్డుపై త్రిపురాంతకేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులు, సుదూర ప్రాంతాలైన విజయవాడ, గుంటూరు, తెనాలి, నూజివీడు ప్రాంతాలకు బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్తూ ఎప్పుడూ రద్దీగా కనిపిస్తుంది. ఈ వాహనాలు రాకపోకలు సాగించాలంటే నరకం చూడాల్సి వస్తోంది. వాహన చోదకులు అప్రమత్తంగా అతితక్కువ వేగంతో నడపాల్సి వస్తోంది. కార్లలో ప్రయాణించేవారు మరో 20 కిలోమీటర్లు అదనం అయినా మార్కాపురం హైవేరోడ్డుపై నుంచి ప్రయాణిస్తున్నారు. పుల్లలచెరువు నుంచి యర్రగొండపాలెం వెళ్లే రోడ్డు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రమైన పుల్లలచెరువుకు వెళ్తున్న సమయంలో వాహనదారుల వెంట యమధర్మరాజు పరుగులు తీస్తున్నట్లు ఉంటుంది. పేరుకు తారు రోడ్డు అయినా ఆ ఛాయలు ఎక్కడా కనిపించవు. ఈ రోడ్డుపై 5 గ్రామ పంచాయతీలు ఉన్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. పెద్దారవీడు మండలంలో ఏ గ్రామానికి వెళ్లాలన్న ఆయా ప్రాంతాల రోడ్లు గుంతలతో స్వాగతిస్తుంటాయి. ముఖ్యంగా చట్లమిట్ల నుంచి రేగుమానిపల్లె, ఏనుగులదిన్నెపాడు నుంచి బద్వీడు చెర్లోపల్లి, తోకపల్లి నుంచి ఏనుగులదిన్నెపాడు రోడ్ల పరిస్థితి వర్ణించేందుకు వీలుండదు. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఈ గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. పెద్దదోర్నాల మండలంలోని హసనాబాద్‌కు తారురోడ్డు వేసేందుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఒకటిన్నర కిలో మీటరు ఉన్న ఈ రోడ్డుపై హడావుడిగా కంకర పరిచారు. దాదాపు 4 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు తారు వేయడం మరిచిపోయారు. దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఉన్న మెటల్ రోడ్డే బాగుండేదని, ఇప్పుడు కంకర పరిచి వదలి వేయడం వలన ఆ రోడ్డుపై ఎప్పుడు జారిపడతామోనన్న భయంతో తమ వాహనాలు నడపాల్సి వస్తుందని ఆ గ్రామస్తులు తెలిపారు. ఇటువంటి పరిస్థితులు మండలంలోని ప్రతి గ్రామంలో నెలకొన్నాయి.



హసనాబాద్‌లో కంకర పరిచి తారు వేయడం మరిచిన రోడ్డు



ఏనుగులదిన్నెపాడుకు ఈ రోడ్డుపై వెళ్లాల్సిందే

సూపర్ సిక్స్ అమలు చేయకుండా సంబరాలా?

- ఏడాది కాలంలో ఎన్ని ఉద్యోగాలిచ్చారు?
- ఆడబిడ్డకు నెలనెలా రూ.1500 ఎక్కడ?
- తల్లికి వందనం కింద రూ.15 వేలని చెప్పి రూ.13 వేలు ఇవ్వడమేంటి?
- స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని గతంలో చెప్పింది మరిచారా?
- సీపీఎం నేత కంకణాల ఆంజనేయులు విమర్శ



మాట్లాడుతున్న ఆంజనేయులు

ముండ్లమూరు(కురిచేడు): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలన్నీ వెంకటే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కంటే సంక్షేమ పథకాలు రెట్టింపుగా అమలు చేస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా ఎన్నికల నాటి హామీ లు అమలు చేయకుండా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఆదివారం ముండ్లమూరు మండలంలోని మారెళ్ల గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ సభ్యుల సమావేశం షేక్.మీరావలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ.. ఏటా 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పి ఏడాది గడిచినా ఒక కొత్త ఉద్యోగమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. ఉద్యోగాలు కల్పించే వరకు నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పడం లేదన్నారు. మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామన్న ఆడబిడ్డ నిధి, అలాగే ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేకపోవడం శోచనీయమన్నారు. తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి రూ.2 వేలు కోత విధించడం దారుణమన్నారు. దీపం పథకం అమలుపై కూటమి నేతల మాటలకు ఆచరణకు పొంతన లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచుతూ, ఆస్తిపన్ను, నిత్యావసర వస్తువుల ధరల భారాలు ప్రజల మీద మోపడం అన్యాయమన్నారు. ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని చెప్పిన వారు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక బలవంతంగా పెడుతున్నారని, ఇది సబబేనా అని ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా, మార్క్ ఫెడ్‌ను రంగంలోకి దింపకుండా అన్యాయం చేయడం సరికాదన్నారు. ముండ్లమూరు మండలపరిదిలో పది లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు నిరుపయోగంగా ఉన్నాయని మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు తెలిపారు. అధికారంలోకి వస్తే వాటిని ఉపయోగంలోకి తెస్తామని చెప్పి ఏడాది గడచినా ఆ దిశగా ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం పాలకుల తీరును స్పష్టం చేస్తోందన్నారు.

అనేక సంవత్సరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు బోడపాటి హనుమంతరావు,మారెళ్ల, గంగన్నపాలెం, జమ్మలమడక శాఖ సభ్యులు మేకల మనుమంతరావు, హనుమయ్య, వెంకటేవ్వర్లు, లక్ష్మినారాయణ, వెల్లంపల్లి శ్రీను, వి.మల్లేశ్వరి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై తిరుమలనాథస్వామి



ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి



గజ వాహనంపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లి గ్రామ సమీపంలో ప్రముఖ పుణ్యక్షేత్రం గొౖడాలికొండ తిరుమలనాథస్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఆరో రోజు ఉత్సవమూర్తులు గజ వాహనంపై ఆదివారం విహరించారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి మూలవిరాట్‌లకు అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, రంగు రంగు పూలతో అలంకరించారు. రాత్రి గరుడ వాహనంపై ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో బాజా భజంత్రీలతో ఊరేగించారు. చుట్టు పక్కల గ్రామాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కోరిన కోర్కెలు తీర్చాలని, మొక్కలు తీర్చుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయం ప్రాంగణంలో ఆంజనేయస్వామి, నవగ్రహాలు, నాగయ్య విగ్రహాలకు పూజలు చేశారు. ఉభయదాతలు గ్రంథే సుబ్బయ్య, పడిగలయ్య, యానయ్య, పెద్ద వెంకయ్య వ్యవహరించారు. చట్లమిట్ల గ్రామానికి చెందిన విశ్రాంతి ఉద్యోగి కందుల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. భక్తులకు బ్రహ్మణ, ఆర్యవైశ్య, రెడ్ల, కాకతీయ కమ్మవారి, శ్రీ కృష్ణదేవరాయ బలిజ తెలగ కాపు, యాదవ, రజక సత్రాల్లో అన్నదానం చేశారు. సోమవారం సాయంత్రం రథోత్సవం, వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో రాత్రికి విద్యుత్ ప్రభపై పాలకచ్చేరి ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే బూచేపల్లికి కృతజ్ఞతలు



ఎమ్మెల్యే బూచేపల్లిని సన్మానిస్తున్న మండల నాయకులు

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఆదివారం నాయన నివాసంలో తాళ్లూరు మండల యూత్ అధ్యక్షుడు కొౖరపాటి విష్ణు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బూచేపల్లి సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి, ప్రచార విభాగం అధ్యక్షుడు యత్తపు మధుసూదన్‌రెడ్డి, మండల కల్చరల్ వింగ్ అధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, గుజ్జుల వెంకటేశ్వర్‌రెడ్డి(గోల్డ్), గొల్లపూడి నవీన్, కొౖరపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం బాధ్యతగా పనిచేస్తానని తాళ్లూరు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నియమితుడైన జగన్నాథం సురేష్ పేర్కొన్నారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డికి కృతజ్ఞత తెలిపారు.

ఉపాధ్యాయునికి ఘన సన్మానం

దర్శి(కురిచేడు): దర్శి మండలంలోని లంకోజనపల్లి గ్రామ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లోకిరెడ్డి వెంకటేశ్వర్లును స్థానికులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఎస్సీ పాఠశాల నుంచి ఎంపీయూపీ పాఠశాలకు బదిలీ అయిన సందర్భంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎనుముల ఝాన్సీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ గోళ్లపాటి హోసన్నబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ నెహేమియా, గోళ్లపాటి మార్కు, పాస్టర్ మల్లెల యోహాను, తూర్పు వీరాయపాలెం పోస్టు మాస్టర్ ఉప్పు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న కాలనీ వాసులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

దర్శి(కురిచేడు): రోడ్డు మార్జిన్‌లో నడిచి వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయాలపాలైన సంఘటన ఆదివారం సాయంత్రం సాయినగర్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. కనిగిరి మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన గూడూరి సత్యశేఖర్‌కు స్వగ్రామంలో ఎటువంటి ఆధారం లేదు. దీంతో దర్శి మండలం చలివేంద్రం వద్ద గల కాశీనాయన ఆశ్రమంలో ఉంటున్నారు. ఆదివారం సాయినగర్ వద్ద నుంచి నడుచుకుంటూ ఆశ్రమం వద్దకు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్య శేఖర్‌కు రెండు కాళ్లు విరిగాయి. అదే మార్గంలో వెళ్తున్న ప్రయాణికులు 108కి సమాచారం అందించారు. సత్య శేఖర్‌కు 108 సిబ్బంది గౌస్‌బాషా, వెంకటరెడ్డి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఒంగోలు జీజీహెచ్‌కు సిఫార్సు చేశారు.



తీవ్రంగా గాయపడిన సత్యశేఖర్

జీజీహెచ్‌లో కర్ర పెత్తనం

- నాలుగో తరగతి ఉద్యోగులపై చిన్నచూపు
- ఫీమేల్ నర్సింగ్, మేల్ నర్సింగ్ స్టాఫ్‌పై పెత్తనం
- అసలు పనికన్నా కొసరు పనికే వినియోగిస్తున్న వైనం



ఒంగోలు టౌన్:

స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓలు కొందరి కర్ర పెత్తనంతో వేధింపులకు గురవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జీజీహెచ్‌లో 70 మంది వరకు ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, స్ట్రెచర్ బాయ్, ప్యాకర్లు పని చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఏడు మంది పేషంట్లకు ఒక ఎంఎన్ఓ కానీ ఎఫ్ఎన్ఓ కానీ డ్యూటీ చేయాల్సి ఉంటుంది. అందుకు బదులుగా ఫ్లోర్‌కు ఒకరిని చొప్పున మూడు ఫ్లోర్లకు కలుపుకుని ముగ్గురికి డ్యూటీ వేస్తున్నట్లు సమాచారం. క్యాజువాలిటీలో మూడు షిఫ్టులకు కలుపుకుని ఆరుగురు ఎంఎన్ఓలు, నలుగురు ఎఫ్ఎన్ఓలు ఉండాలని చెబుతున్నారు. క్యాజువాలిటీలో కూడా సరిపడా డ్యూటీలు వేయడం లేదని తెలుస్తోంది. దానికి బదులుగా కొంత మంది ఎంఎన్ఓలు, ఎఫ్ఎన్ఓలకు ఓపీ కౌంటర్లో డ్యూటీలు వేస్తున్నట్లు సమాచారం. జీజీహెచ్‌లో 7 నుంచి 11వ కౌంటర్ వరకు ఓపీలు రాయడం కనిపిస్తుంది. నిజానికి ఓపీ సెక్షన్‌ను ఫార్మసీ డిపార్ట్‌మెంట్ చూసుకోవాల్సి ఉంది. అలాగే ఎంఎన్ఓలను ఎలక్ట్రీషియన్లుగా, ప్లంబర్లుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా వాడుకుంటున్నారని సమాచారం. వార్డులలో మంచాల మీద వేసే బెడ్ షీట్లను సీఎస్డీ నుంచి ఎంఎన్ఓల చేత తెప్పిస్తున్నారని, తిరిగి వారే సీఎస్డీకి చేర్చాల్సి వస్తోందని ఎంఎన్ఓలు వాపోతున్నారు. ఇది తమ పని కాదని, తమను సక్రమంగా వినియోగించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో బెడ్‌షీట్లను చేర్చడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉందంటున్నారు.

కాంట్రాక్టర్ దగ్గర నుంచి నెలవారీ మామూళ్లు...

కాంట్రాక్టర్ వద్ద నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్న అధికారులు అనేక పనులను ఎంఎన్ఓల చేత చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు స్టాఫ్ నర్సులు వారు చేయాల్సిన పనులను ఎంఎన్ఓలు, ఎఫ్ఎన్ఓలచే చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంజక్షన్లు వేయడం, సెలైన్లు పెట్టడం, గాయాలకు కట్టు కట్టడం లాంటి పనులను ఎంఎన్ఓలు, ఎఫ్ఎన్ఓల చేత, ట్రైనీ నర్సింగ్ స్టాఫ్‌ల చేత చేయిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఇక నైట్ డ్యూటీల సమయంలో నర్సింగ్ స్టాఫ్ సక్రమంగా పనులు చేయకుండా ఎంఎన్ఓలచేత చేయిస్తున్నారని సమాచారం. స్టాఫ్ నర్సులు మాత్రం సెల్‌ఫోన్లు చూస్తూ కొందరు, గుర్రుగా నిద్రపోతూ ఇంకొందరు గడుపుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

నర్సుల సేవలపై రోగుల అసంతృప్తి...

వార్డులలో నర్సుల సేవల పట్ల రోగులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అంతేగాకుండా స్టాఫ్ నర్సులు కిందిస్థాయి ఉద్యోగులపై పెత్తనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంఎన్ఓలు ఎవరైనా చెప్పినమాట వినకపోతే మెమో ఇస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. జీజీహెచ్ అధికారుల అస్తవ్యస్త విధానాల వలన ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలు ఇబ్బందులకు గురవుతున్నారు. పేరుకు 70 మంది వరకు ఉన్నప్పటికీ కనీసం ఒక రోజు సెలవు పెట్టుకునేందుకు కూడా అవకాశం లేదని, అత్యవసరమైన పనులు పడినప్పుడు సెలవు పెట్టుకోవాలంటే తనకు బదులుగా మరొకరిని ఏర్పాటు చేసి వెళ్లాల్సిందిగా హుకుం జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే అంతంతమాత్రం జీతాలతో బతుకులు వెళ్లదీస్తున్న మేల్ నర్సింగ్, ఫిమేల్ నర్సింగ్ సిబ్బంది అధికారుల ఒత్తిళ్లతో సతమతమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓల సమస్యలపై దృష్టి సారించాలని, నిబంధనల ప్రకారం వారికి డ్యూటీలు వేయాలని, స్టాఫ్‌నర్సుల పెత్తనాన్ని అరికట్టాలని కోరుతున్నారు. నాలుగో తరగతి ఉద్యోగులను చిన్నచూపు చూడటం మానివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

మార్కాపురం: మార్కాపురం నుంచి త్రిపురాంతకంవైపు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు మార్కాపురం మార్కెట్ యార్డు వద్ద అదుపు తప్పి డివైడరును ఢీకొట్టింది. ఆదివారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఐసీడీఎస్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత

దర్శి(కురిచేడు): ఐసీడీఎస్ దర్శి ప్రాజెక్టులో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రాజెక్టు పరిధిలో ఐదు మండలాల్లో మొత్తం 15 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్‌కు ఒక సూపర్‌వైజర్ ఉండాల్సి ఉంది. కానీ 15 క్లస్టర్లకు కేవలం నలుగురు సూపర్‌వైజర్లే ఉండటంతో కేంద్రాలపై సరైన పర్యవేక్షణ ఉండటం లేదు. గతంలో ప్రతి క్లస్టర్‌కు ఒక సూపర్‌వైజర్ ఉండేవారు. అందువల్ల ఆయా క్లస్టర్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తరచుగా పరిశీలిస్తూ ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూసే వారు. కానీ నేడు సూపర్‌వైజర్లు లేకపోవడంతో పర్యవేక్షణ కష్టంగా మారింది. అంగన్‌వాడీ కార్యకర్తల్లో అర్హత ఉన్న సీనియర్లను తాత్కాలిక సూపర్‌వైజర్లుగా నియమించినా కొంతమేర పర్యవేక్షణ ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ప్రభుత్వం వెంటనే ఐసీడీఎస్‌లో సిబ్బంది కొరతను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన కూచిపూడి నృత్య శిక్షణ

ఒంగోలు మెట్రో: నళినీ ప్రియా కూచిపూడి నృత్యానికేతన్, ఒంగోలు వారి ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో 45 రోజుల పాటు స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎస్వీ శివకుమారి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో వ్యక్తిగత వికాసం, కళల పట్ల ఆకర్షణ కలుగుతాయని తెలిపారు. సంతపేట ఆలయ కమిటీ చైర్మన్ అళహరి చెంచలరావు, ఆధ్యాత్మిక ప్రవచకుడు పొన్నూరు శ్రీనివాసరావు, లాయర్ కృష్ణవేణి, ఎక్కిరాల ద్వారకానాథ్ జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొని తిలకించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు